వెంకటేశ్వరమెట్టలో కన్నీటి వెతలు

వేసవి ప్రతాపం పూర్తి స్థాయికి చేరలేదు. అప్పుడే జీవీఎంసీలో క'న్నీటి' వెతలు మొదలయ్యాయి. ప్రస్తుతానికి చాలినన్ని నీటి నిల్వలు ఉన్నా.. జీవీఎంసీ నీటిసరఫరా విభాగం నిర్లక్ష్యం వల్ల పలు ప్రాంతాల్లో తాగునీటి ఇక్కట్లు నెలకొన్నాయి. నియోజకవర్గంలోని వెంకటేశ్వరమెట్ట ప్రజలు వారం రోజులుగా నీటి కోసం అవస్థలు పడుతున్నారు. తాగేందుకు, దైనందిన అవసరాలకు సరిపడా నీరు కూడా కుళాయిల ద్వారా సరఫరా కావట్లేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవట్లేదని వాపోతున్నారు.

- తాగు నీటి కోసం మహిళల ఇక్కట్లు
- వారం రోజులుగా నీటికి ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



ప్రైవేట్ ట్యాంకర్ ద్వారా నీటిని ఇంటి పైనున్న ట్యాంకులోకి ఎక్కిస్తున్న గృహ యజమాని



మంచినీటి కోసం ఎదురు చూస్తున్న వెంకటేశ్వరమెట్ట నివాసులు

అల్లిపురం: జీవీఎంసీ పరిధిలో చాలా వరకు టీఎస్సార్ పాయింట్ నుంచే తాగునీరు సరఫరా అవుతుంది. వెంకటేశ్వరమెట్టపై కూడా ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటికి టీఎస్సార్ నుంచే నీరందుతుంది. అయితే వారం రోజులుగా వెంకటేశ్వరమెట్ట వాసులకు చాలినంత నీరు సరఫరా కావట్లేదు. తాగునీటికి, వాడుక నీటికీ ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను ఆశ్రయించి, చేతి చమురు వదిలించుకుంటున్నారు.

పట్టుమని పది బిందెలైనా నిండట్లేదు!

ప్రతి రోజు తెల్లవారు జామునే కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీని కోసం వేకువజాము నుంచే మహిళలు కుళాయిల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సన్నటి ధార రావడంతో పట్టుమని పది బిందెలు కూడా నిండట్లేదని చెప్పన్నారు. దీంతో ప్రైవేట్ ట్యాంకర్లే దిక్కవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెయ్యి లీటర్ల నీటికి అత్యవసరాన్ని బట్టి 300–500 వరకు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. రెండు రోజుల కోసారి ఇలా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందంటున్నారు. జీవీఎంసీ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని కోరినా అధికారులు స్పందించట్లేదని ఆక్షేపిస్తున్నారు. సిబ్బందిని అడుగుతుంటే మోటార్ మరమ్మతులకు వచ్చిందని, త్వరలోనే బాగైపోతుందని చెప్తున్నారు తప్ప.. తమ నీటి కష్టాలను మాత్రం తొలగించట్లేదని వెంకటేశ్వరమెట్ట మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులుగా ఇదే దుస్థితి



వారం రోజులుగా తాగు నీటి కుళాయిల పరిస్థితి ఇలానే ఉంది. తెల్లవారు జామునే నిద్రలేచి కుళాయిల వద్ద కాపాలా ఉంటున్నా... కనీస అవసరాలకు సరిపడా నీరైనా రావటంలేదు. ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు లేరు.

– మళ్ల కనకరత్నం

ఎవరూ పట్టించుకోవట్లేదు



తాగునీటి కోసం మేం పడుతున్న కష్టాలలను ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. గత వారం రోజులుగా మంచినీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకర్ల నీటి కోసం చేతి చమురు వదిలించుకుంటున్నాం.

– నిమ్మల శోభన

ఫిర్యాదు చేసినా లాభం లేదు



నీటి లభ్యత తక్కువగా ఉందని, మరమ్మతులు చేసి సరిచేయాలని చెప్పినా పట్టించుకునేవారు లేరు. వాటర్ ట్యాంకులు ద్వారా నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. సన్నటి ధార కావడంతో అవసరానికి తగినన్ని నీళ్లు రావట్లేదు.

– కోరిబిల్లి త్రినాథ్

నిత్యం ఇదే బాధ



మంచినీటికోసం నిత్యం అవస్థలే. ఎండాకాలం మొదలైనప్పటి నుంచే ఇలా బాధ పడాల్సి వస్తోంది. ఎండలు మరింతగా ముదిరితే పరిస్థితి ఏంటో తలచుకుంటేనే భయమేస్తోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పి.సత్యవతి

క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

కుటుంబం చెంతకు వృద్ధుడు



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: నల్ల గడుల షర్ట్ వేసుకున్న వృద్ధుని పేరు నారాయణరావు, వయసు 62 ఏళ్లు. ఇతను ఉండేది నగరంలోని వెంకటేశ్వర కాలనీ. ఈ నెల 3న ఏయూటీడీ ఫీల్డ్ విజిట్‌లో ఇతని దీన స్థితిని చూసి జీవీఎంసీ–ఏయూటీడీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. కుటుంబ వివరాలు అడిగితే చెప్పడానికి ఇష్టపడలేదు. దీంతో అల్లుడు వై.దుర్గారావు, కుమార్తె భవాని తండ్రి ఆచూకీ తెలుసుకుని షెల్టర్‌కి సోమవారం వచ్చారు. కూతురు, అల్లుడితో గొడవ పడి వచ్చేసినట్లు వారి ద్వారా తెలిసింది. తండ్రి ఆపద సమయంలో ఉంటే ఆశ్రయం కల్పించినందుకు ఏయూటీడీకి, జీవీఎంసీకి ధన్యవాదాలు తెలిపి, నారాయణరావును అల్లుడు, కూతురు వెంట తీసుకెళ్లారు.

'సుగుణ ఆత్మహత్యకు కారకులను అరెస్ట్ చేయాలి'



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మత్స్యకారులు

మహారాణిపేట: బొడ్డు సుగుణ ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేసి, వారి కుటుంబాన్ని కాపాడాలని మత్స్యకార సంఘాలు, సీఐటీయూ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు–మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షుడు కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ మత్స్యకార మహిళ సుగుణ మృతికి కారణమైన వారిలో అందరినీ అరెస్ట్ చేయలేదన్నారు. సంఘటన జరిగి నేటికి 11 రోజులైనా పోలీసుల స్పందన లేదన్నారు. సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ సుగుణ ఆత్మహత్యలో ప్రమేయం ఉన్న మరో కొంత మంది బయట తిరుగుతున్నారని, తక్షణం వారిని కూడా అరెస్టు చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేశారు.

లే అవుట్లలో సదుపాయాల కల్పనకు వినతి

మహారాణిపేట: నగర శివారులో నిర్మించిన పలు లే అవుట్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని మానం ఆంజనేయులు నగర్ రెసిడెన్షియల్ సేవా సంఘం నాయకులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కోరారు. దీనిపై జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు సంయుక్తంగా శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతూ ఆయన వినతిపత్రం సమర్పించారు. వీఎంఆర్‌డీఏ, ఇతర లేవుట్లకు మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సదుపాయాలు కల్పించాలని కోరారు.

టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు బాధ్యతల స్వీకరణ



అల్లిపురం: టూటౌన్ శాంతి భద్రతల సీఐగా వీవీసీఎం ఎర్రంనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఇప్పటి వరకు విధులు నిర్వహించిన బి.తిరుమలరావు భీమిలి శాంతి భద్రతల సీఐగా బదిలీపై వెళ్లారు. దీంతో ఆ స్థానంలో ఎర్రంనాయుడును నియమిస్తూ ఈ నెల 15న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రంనాయుడు గతంలో టూటౌన్, పెదగంట్యాడ ఎస్ఐగా, ఈస్ట్ క్రైం సీఐగా, స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేశారు.

హెల్మెట్ ధరించని వాహనచోదకులకు కౌన్సెలింగ్



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీలక్ష్మి

అల్లిపురం: ద్విచక్ర వాహన చోదకులు తప్పక హెల్మెట్ ధరించాలని టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ కె.శ్రీలక్ష్మి సూచించారు. ఈస్ట్ ట్రాఫిక్ సర్కిల్ –1, ట్రాఫిక్ సీఐ ఎం.శ్రీను ఆదేశాల మేరకు ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి 16 మంది హెల్మెట్ ధరించని వాహనచోదకుల నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం టూటౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నాణ్యమైన, ఐఎస్ఐ మార్కు గల హెల్మెట్‌లనే ధరించాలని సూచించారు. హెల్మెట్ వాడకం వలన ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అందరూ కలసికట్టుగా కృషి చేద్దామన్నారు. మద్యం తాగి వాహనం నడపడం వల్లనే చాలా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

జోన్-4 పీజీఆర్ఎస్‌కు 4 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జోన్-4 జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 పరిధిలో నివసిస్తున్న వారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను వినియోగించుకోవాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. జోన్–4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. మొత్తం 4 దరఖాస్తులు రాగా.. అందులో ఇంజినీరింగ్ విభాగానికి –2, రెవెన్యూ విభాగానికి సంబంధించి 1, తాగునీటి విభాగానికి 1 అర్జీ ఉన్నాయి. జెడ్సీ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఏపీడీ పద్మావతి, రెవెన్యూ అధికారులు అప్పలరాజు, ఎలక్ట్రికల్, తాగునీటి విభాగం అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

త్వరితగతిన అర్జీల పరిష్కారం

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బి.రాము స్వీకరించి పరిశీలించారు. వాటర్ సప్లై విభాగానికి 01, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, డీఈ రామసుబ్బారావు, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు బధిరులకు సెల్‌ఫోన్లు



బధిర విద్యార్థులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏడుగురు బదిరుల విద్యార్థిని,విద్యార్థులకు సైన్ లాంగ్వేజ్ యాప్‌తో కూడిన సెల్ ఫోన్‌లను కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ సోమవారం అందజేశారు.కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు బధిరులు పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నవారికి వీటిని అందజేశారు.

బార్లలో పోలీసుల తనిఖీలు

విశాఖ సిటీ: విశాఖలో బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. సుమారు 450 పోలీస్ అధికారులు, సిబ్బందితో 92 బృందాలుగా 104 బార్లు, పబ్‌ల్లో ఏకకాలంలో తనిఖీ చేపట్టారు. ఇందులో సంబంధిత శాఖల నుంచి లైసెన్సులు లేకుండా వ్యాపారం, మైనర్లకు మద్యం విక్రయాలు, ఫైర్ ఎన్‌ఓసీలు, సీసీటీవీ, అక్రమ మద్యం, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయాలు ఇలా అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో 23 బార్లలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. 14 బార్లకు ఫైర్‌ఎన్‌ఓసీ, 2 బార్లలో సీసీటీవీ కెమెరాలు, ఒకచోట ఫుడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నిర్వహణ, ట్రేడ్ లైసెన్సులు లేకుండా 2, పార్కింగ్ సదుపాయం లేకుండా 14, జీఎస్టీ లేకుండా ఒక బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నట్లు తేల్చారు. సదరు బార్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సిఫార్సు చేశారు.

పాఠశాల పారిశుధ్య కార్మికుల నిరసన

మహారాణిపేట: పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల జీతాలు పెంచాలని కోరుతూ కార్మికులు ఆందోళనకు దిగారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి జి.మంగశ్రీ మాట్లాడుతూ పాఠశాల శానిటేషన్ వర్కర్స్‌కు ప్రస్తుతం ఇస్తున్న వేతనాలు సరిపోవడం లేదన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ వర్కర్లకు వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదని, ఆక్షేపించారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

కాలుష్య నియంత్రణకు వారంలో ఓ రోజు



ఆర్టీసీ బస్సు నుంచి దిగుతున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణాను వినియోగించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పిలుపునిచ్చారు. సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా సామాజిక బాధ్యతగా జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు వారంలో ఓ రోజు వ్యక్తిగత వాహనాలు వీడి, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు కూడా వ్యక్తిగత వాహనాలు వీడి, సైకిళ్లు లేదా ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించి, కాలుష్య నివారణకు సహకరించాల్సిందిగా కోరారు.

మహిళా కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థినులతో కళాశాల, వివిధ సంస్థల ప్రతినిధులు

- 58 మంది ఎంపిక

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 58 మంది ఎంపికయ్యారు. కళాశాల జేకేసీ నేతృత్వంలో నిర్మాణ్ సంస్థ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో ఫాక్స్‌కన్ కంపెనీ(హైదరాబాద్) క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. ఈ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 145 మంది విద్యార్థినులు పాల్గొనగా, 58 మంది ఉపాధి అవకాశాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఫాక్స్‌కన్ సంస్థ హెచ్‌ఆర్ జి.హరిణి, ప్రవీణ్‌కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగావకాశాలు పొందిన విద్యార్థినులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్మాణ్ సంస్థ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.మహేష్, వేణుగోపాల్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్, జేకేసీ కో–ఆర్డినేటర్ ఎం. విద్యాకల్పన, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ బి. సంతోషి అనూష తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నాలో జర్నలిస్టులు

సీతమ్మధార: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు 4 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇతర సమస్యలను పరిష్కరించి మీడియాపై దాడులను ఆపాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలలో మాదిరి జర్నలిస్టులకు రూ.10 వేలు చొప్పున పెన్షన్ కల్పించాలని, ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని సూచించారు. అనంతరం ముఖ్యమంత్రికి పంపే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్‌కు జర్నలిస్టుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ పరిరక్షణకు ఉద్యమం ఉధృతం

- నేడు గేట్ మీటింగ్
- 24 నుంచి నల్లబ్యాడ్జీలతో నిరసన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్: పోర్టు హాస్పిటల్ పరిరక్షణకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్, వీడీఎల్పీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. సిటు కార్యాలయంలో ఉద్యమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఆయా యూనియన్ల నాయకులు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, రీటెండర్ ప్రక్రియ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 18 నుంచి ఉద్యమం తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 18న పోర్టు ప్రాంగణంలో గేట్ మీటింగ్‌లు, 24 నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన, ఏప్రిల్ ఒకటి నుంచి పోర్టు ఉద్యోగుల నివాస ప్రాంతాల్లో నిరసనలు, ఏప్రిల్ 9న చలో ఏవోబీ కార్యక్రమం చేపట్టనున్నట్టు వెల్లడించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు, ఫెడరేషన్ కార్యదర్శి బి.జగన్, యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామలింగేశ్వరరావు, వీడీఎల్పీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జక్కాన సత్యనారాయణ, కార్యదర్శి బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లో రెల్లి కులానికి న్యాయం చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించి వస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, నాయకులు

మహారాణిపేట: ఎస్సీలో రెల్లి కులానికి 1 శాతం మాత్రమే రిజర్వేషన్ ఇవ్వడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని పలు రెల్లికుల సంఘాలు ఆక్షేపించాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్ ఆధ్వర్యంలో ఏపీ రెల్లికుల అభివృద్ధి సంఘం నాయకులు సోమవారం వినతి పత్రం అందించారు. జానకిరామ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో న్యాయమైన వాటా రెల్లి కులాలకు వచ్చేలా చూడాలని కోరారు. రెల్లిల స్థితిగతులపై మరింత లోతుగా అధ్యయనం చేయాలన్నారు. గౌతమ్ బాబా సంక్షేమ సంఘం స్టీరింగ్ కమిటీ సభ్యులు మాడుగుల భాస్కరరావు, కస్తూరి వెంకటరావు, వడ్డాది వెంకటరావు(పాల్), దశమంతుల చిన్ని, కోన శ్రీనివాసరావు, బంగారు ఈశ్వరరావు, సురుపిల్లి మోహన్‌రావు, సురుపిల్లి రంజిత్‌కుమార్, చెన్నా శ్రీనివాసరావు, లోకొండ అప్పారావు, స్థానిక కుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రెల్లి కులస్తులకు రిజర్వేషన్లు పెంచాలి: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల శాతం పెంచాలని పలు రెల్లికుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీ రెల్లికుల అభివృద్ధి సంఘం, వాటి అనుబంధ సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాన రవి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో రెల్లికులస్తులకు అన్యాయం జరుగుతోందన్నా రు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు

సెంట్రల్ జైలులో 'సెల్'చల్ సూత్రధారి ఫార్మసిస్టే!

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సెల్ ఫోన్ కథ గుట్టు వీడుతోంది. సెల్ ఫోన్లు వినియోగించిన ఖైదీలు, వీటిని చేరవేసిన వారి వ్యవహారం బయటపడుతోంది. మూడు నెలలు క్రితం ఖైదీలకు గంజాయి చేరవేయడంతో ఒక్కసారిగా విశాఖ సెంట్రల్ జైల్ వార్తలకెక్కింది. అప్పటి నుంచి వరుసుగా వివిధ సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఓ ఖైదీ ఆత్మహత్య చేసుకోగా..నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై బదిలీవేటు వేయగా..కొందరు అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. మరొకొందరికి మోమోలు జారీ అయ్యాయి. ఇంత జరిగినా దఫదఫాలు జైలులో నాలుగు సెల్ ఫోన్లు బయటపడడంతో జైలు అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దర్యాప్తులో భాగంగా రెండు సెల్ ఫోన్లు ఖైదీలకు చేరవేసిన వ్యక్తిని కనిపెట్టారు. మిగిలిన సెల్ ఫోన్లు ఎవరు అందజేశారో దర్యాప్తులో తేలనుందని ఆరిలోవ పోలీసులు చెప్పారు.

ఫార్మసిస్టే కీలకధారి

ఇక్కడ కేంద్ర కారాగారంలో ఫార్మసిస్ట్‌గా పనిచేసిన కడియం శ్రీనివాసరావు మూడు నెలల క్రితం భోజనం క్యారేజీలో గంజాయి తీసుకొని లోపలకు వెళుతుండగా జైల్ ప్రధాన ద్వారం వద్ద సిబ్బందికి పట్టుబడ్డాడు. దీంతో అతనిని విధుల నుంచి తొలగించారు. అనంతరం జైల్ లోపల సెల్ ఫోన్లు కలకలం రేపాయి. వాటిలో రెండు సెల్ ఫోన్లు శ్రీనివాసరావు ఖైదీలకు అందించినట్లు పోలీసుల దర్యాప్తుల్లో వెల్లడైంది. శ్రీనివాసరావుకు సహకరించిన ఆయన భార్య పుష్పలతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. రెండు సెల్ ఫోన్లను జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న నాగమల్లేశ్వరరావు అనే ముద్దాయికి శ్రీనివాసరావు ఇచ్చాడు. ఇందుకు గానూ రూ.లక్షకు ఒప్పందం కుదుర్చుకొన్నాడు. రూ.లక్ష శ్రీనివాసరావు భార్య పుష్పలత బ్యాంక్ అకౌంట్‌కు వేసే విధంగా బేరం కుదుర్చుకున్నారు. దీంతో నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు పుష్పలతకు ఫోన్‌పే ద్వారా కొంత మొత్తం, మిగిలినది నేరుగా అందించారు. ఈ ఫోన్లు, నగదు లావాదేవీల వ్యవహారంలో పుష్పలత కూడా భాగస్వామి కావడంతో ఆమెను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. జైలులో నాగమల్లేశ్వరరావు ఫోన్ వినియోగిస్తున్న విషయం గమనించిన ఓ కిడ్నాప్ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న హేమంత్, మరో ఖైదీ రాజేష్ వాటిలో ఓ ఫోన్ తీసుకొన్నారు. ఆ ఫోన్ వాళ్లిద్దరు వినియోగించేలోగే వాటి గుట్టు రట్టు అయింది. మిగిలిన ఫోన్ల వ్యవహారం కూడా త్వరలోనే బయటపడనుందని, వాటిపై కూడా లోతుగా దర్యాప్తు జరుగుతోందని ఆరిలోవ సీఐ సీహెచ్.మల్లేశ్వరరావు తెలిపారు.

మూగజీవాలపై ప్రేమకు నిదర్శనం



మూగజీవాలు తమ సమస్యను చెప్పుకోలేవు. మనమే తెలుసుకుని వాటికి చికిత్స అందించాలి. వేసవి కాలంలో అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. యజమానులు వీటిని ఎంతో ప్రేమగా సాకుతుంటారు. అవసరమైనప్పుడు వైద్యుల వద్దకు తీసుకువెళ్ల చికిత్సలు అందిస్తారు. పలువురు జంతు ప్రేమికులు తమ కుక్కలను వైద్యం కోసం సోమవారం ప్రభుత్వ పశు వైద్యశాలకు తీసుకువచ్చారు. వీటిని తమతో బాటు ద్విచక్రవాహనాలపై కూర్చోపెట్టుకుని, చేతి సంచిలో ఎండ తగలకుండా..ఇలా అనేక విధాలుగా వీరు ఆస్పత్రికి తీసుకువచ్చారు.

ఫొటోలు: సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం